కథా నిలయం
శ్రీకాకుళం

# 2. దృశ్యం-అదృశ్యం

బస్ వెళుతోంది..

ఒక్కొక్క చోట నత్తనడకగా.. ఒక్కొక్కచోట అలతివేగంగా.. ఇంకొంత సాగిన తర్వాత వేగంగా ముందుకు పోతోంది... ఆగుతోంది.. సాగుతోంది..

వాహనాలు.. రద్దీ.. జనం, జనం.. చీమలపుట్ట మీద వో కడివెడునీళ్లు కుమ్మరిస్తే అవన్నీ చెల్లాచెదురైన విధంగా.. అడ్డదిడ్డంగా జనం.. ఉరుకులు... పరుగులు..

ట్రాఫిక్ జామ్! బస్‌కి బ్రేక్.. 'గీ!' మంటూ ఆగింది.

ఉలిక్కిపడి తెప్పరిల్లింది మాణిక్యం. ఆలోచనలమాల తెగింది. అక్షరాలు.. దొర్లిపడిపోతున్నై. కాలేజీలో తాటికాయంత అక్షరాల్లో ఫ్లోర్ ఫ్లోర్‌కీ పెట్టిన అందమైన నోటీస్ బోర్డులు కళ్లముందు కనిపిస్తున్నాయి.

'ర్యాగింగ్ చట్ట విరుద్ధం. ర్యాగింగ్‌కి పాల్పడిన వారికి శిక్ష తప్పదు. విద్యాలయం మీ భవిష్యత్ జీవితానికి ప్రథమ సోపానం..' ఇలా... ఇలా...

మాణిక్యం కణతలు నొక్కుకుంది. తలనొప్పి.. పక్కకి చూసింది. మొబైక్స్‌మీద నవ్వుకుంటూ, తుళ్లుకుంటూ యువతీయువకులు.

బస్ కదిలింది. మాణిక్యం మనసులో ఆలోచనకు కూడా మళ్లీ నడకొచ్చింది. ఆందోళన... అస్తిమితం..

అమ్మకు చెప్పుకుంటే? ఇదివరకటిలాగానే "నేను చెప్పానా, లేదా? మెత్తని వాళ్లని చూస్తే మొత్త బుద్ధవుతుంది" అంటూ ఒంటికాలిమీద లేస్తుంది. 'బీ..బోల్డ్' అంటుంది. లేదా, "మీ నాన్నకి చెప్పు. ఉప్పుపాతరేస్తారు" అని వెటకారంగా భయపెడుతుంది. మాట్లాడి, మాట్లాడి చివరికి "మళ్లీ చెబుతున్నాను. 'ఉద్ధరేదాత్మ నాత్మానాం" అంటుంది గీత. నిన్ను నువ్ ఉద్ధరించుకోవాలి" అని తన అనుభవాల గురించీ, తన కాలేజ్ రోజుల్ని గురించీ పూసలు గుచ్చుతుంది. బుర్రని ఇగ్నైట్ చేస్తుంది.

పోనీ- నాన్నకు చెప్పేస్తే? "అమ్మాకూతురూ కలిసి ఆ కాలేజీనే కావాలని ఏడిస్తిరికదా. అనుభవించండి" అంటూ ముందు మాటల ఈటెల్ని వదుల్తాడు. ఆ తర్వాత తన బ్రహ్మాస్త్రాన్నీ వదిలొచ్చు. 'చదివింది చాలు. ఇంట్లో కూర్చొని ఎక్స్‌టర్నల్‌గా ఏదైనా చెయ్యి' అని తీర్పునీ ఇవ్వొచ్చు.

రేపు ప్రిన్సిపాల్‌కి చెబితే? అమ్మో! ఆయనొక పెద్ద నస. చాలా గత ఉదాహరణలున్నై. 'లైట్ తీస్కోవాలి. రెణ్ణెల్లు పోతే, మీరూ మీరూ ఛెమ్స్ అవుతారు. చెట్టాపట్టాలేసుకు తిరుగుతారు. ప్రేమలో పడిపోతారు' అంటాడు. 'పబ్స్‌లోకీ దూరతారు' అని పళ్లికిలిస్తూ ఛలోక్తులు విసురుతాడు. కొసమెరుపుగా- 'ఏ హోటల్ రూమో..' అంటూ వంకరచూపు చూస్తాడు. అదొక అవస్థ..!

'ఉఁహూ..' ఆలోచనల్లోనే తల అడ్డంగా ఊపింది.

లెక్చరర్ వర్ధని మేడమ్‌తో మాట్లాడితే?-

'మాణిక్యం నువ్ కొంచెం 'ఆడ్'గా వున్నావ్ తల్లీ. చూడు-ఆ ముక్కుకి ముక్కెరా, చెవులకి జూకాలూ, చేతికి గాజులూ, ఆ పెద్ద స్టిక్కరూ... అన్నీ అవుటాఫ్ డేట్.. నువ్ మారాలి మాణిక్యం. డోన్ట్‌వర్రీ-దేవిల్ ఛేంజ్ యూ. భయపడకు మరి" అని లెసన్ పీకుతుంది. ఇట్టాంటి లెసనే పీకిందిట-క్రితం సంవత్సరం. అమృత అనే స్టూడెంట్ కాస్తా 'మృత' అయిపోయిందిట! పెద్దకేస్ జరిగింది. ఛానెళ్లూ, ప్రెస్సూ, మహిళా సంఘాలూ .. ఎంతో రభస... చివరకేమయింది? ఎవరికీ తెలీదు. ఆ ఘటనకి కారణమైన వాడు మాత్రం విదేశాలకి వెళ్లి పోయాడని చెప్పుకున్నారు!

లేదా-ఇప్పుడందరూ ఇచ్చే ఉచిత సలహా-ఒంటరిగా వాళ్ల కంటపడొద్దని.

పోనీ దగ్గరి స్నేహితురాళ్లని చూద్దామా అంటే- కరుణా, మాధవీ, సరళా-ముగ్గురూ పిరిగ్గొడ్డులే! తన లాగానే!

వారం క్రితం-ఓ రోజు,

లంచ్ అయిన తర్వాత కరుణా, సరళా, మాధవీ ముందుగానే ఇళ్లకి వెళ్లిపోయారు. తను కేంపస్‌లో నడుస్తోంది. హఠాత్తుగా వాలారు ఆ నలుగురూ. తన పాలిట దుష్ట చతుష్టయం. బాలూ, ప్రతాప్, సుందర్, హరీష్! వెంటనే గబగబా వెళ్లిపోవటానికి దిక్కులు వెతుక్కుంది. కుదరనీయలేదు. పక్కనున్న వాళ్లు చూసీచూడనట్లు తప్పుకుపోయారు.

ప్రతాప్ బైక్‌ని తనముందు పెట్టి "మిట్టీ-నువ్ అమ్మపోలికా? నాన్న పోలికా?" అని ఇకఇకలాడాడు. "అరే-ఫూల్. అమ్మపోలికే. తేలీటంలా. ఇప్పుడే ఇంచక్కా ఇద్దరు పిల్లల తల్లిలా లేదూ?" సుందర్ ప్రాసవేస్తూ నవ్వుతున్నాడు. పకపకలు..

తనకు ఏడుపొచ్చేసింది. మేగజైన్‌తో మొహం కప్పుకుంది.

సుందర్ తన చేతుల్లో నుంచీ సుతారంగా మేగజైన్‌ని లాగేసుకున్నాడు. "నౌ-యూ వీప్" అని "ఫోర్ నైన్ కూడా గాళ్స్‌కి మంచి హైటేలే" అని జోక్ చేశాడు బాలు.

"యూ వాంటూ ఎన్‌జాయ్ హర్ వీపింగ్? ఒకే.. ఒకే..." హరీష్!! అతని మాటలకి గొల్లున నవ్వాడు ప్రతాప్. "అరె.యార్..నీ సెంటెన్స్‌లో 'వీపింగ్' తీసెయ్యరా బాబూ. సరిపోతుంది" డబుల్ మీనింగ్ వదిలాడు.

కడుపు రగిలిపోయింది. పెదవులమీద కసి. కళ్ళల్లో చింతనిప్పులు. పిడికిళ్లు బిగిసినై. మాట ఎట్లా వచ్చిందో తెలీదు.'హోల్డ్ ద టంగ్' అనేసింది. క్షణంసేపు బిత్తరపోయారు. నలుగురూ ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు. "ఓ..కే. చూడు మిట్టీ.. ఐమీన్-మాణిక్యం. వో చిన్న హెల్ప్ చెయ్. రేపు మా లంచ్‌కి హోస్ట్‌వి నువ్వు. అంతే, సింపుల్. నో ప్రాబ్లెమ్.. ఓ.కే?" ప్రతాప్ ప్రపోజల్. అతనే గ్రూప్ లీడర్. 'యా..యా...' అంటూ అందరూ కేరింతలు కొట్టారు.

వాళ్లని తప్పించుకుంటూ, పక్కగా గబగబా అడుగులేసింది. వెనుకనుంచీ 'లంచ్.. హోస్టింగ్.. మర్చిపోకు' 'డోన్ట్ ఫర్‌గెట్-మిట్టీ' అంటూ క్లాపింగ్.

ఆ రాత్రి, అమ్మకు చెప్పింది. ఆమె స్పందన మామూలే. లోకం పోకడ గురించీ, పిల్లల ప్రవర్తన గురించీ, సినిమా, టీవీ ప్రభావం గురించీ.. చాలా సేపు మాట్లాడింది. చివరికి 'తగలెయ్. తప్పేదేముంది?" అన్నది. "లేదా, 'నథింగ్ డూయింగ్. పిచ్చి వేషాలేయకండి అని చెప్పెయ్. బీ బోల్డ్ ఐసే" అంది. "అమ్మో వాళ్లతో నూసెన్స్. నేను పడలేను" అంటే; నవ్వేసి "అయితే పాకెట్ ఖాళీ" అంది.

మర్నాడు డబ్బు వదిలింది.

కానీ-ఇవాల్టి పరిస్థితి వేరు. ఇవాళ జరిగింది వేరు. ఈ సంగతి చెప్పటమా లేదా? ఇదీ సందిగ్ధం. అసలు జరిగిందేఁవిటి?

ఇవాళ కాలేజ్‌కి గంగూలీ అని ఓ ప్రొఫెసర్-ఢిల్లీ నుంచీ వచ్చాడు. గెస్ట్ స్పీకర్. స్టూడెంట్స్ అందరికీ కంబైన్డ్ సెషన్. గంగూలీ వయసు మళ్లిన వ్యక్తి. అనుభవజ్ఞుడు. దేశవిదేశాల్లో పేరు బడినవాడు. ఆయన లెక్చర్ విషయం-'సెల్ఫ్‌గ్రోత్'! బాగా మాట్లాడాడు. ఆ తర్వాత ప్రశ్నలూ-సమాధానాలూ. అప్పుడు మూడు నిముషాల సమయంలో ఒక టాపిక్ ఇచ్చి ఒక్కొక్కర్నీ మాట్లాడమన్నాడు. కరుణని వాళ్ల మదర్ గురించి చెప్పమన్నాడు. నిముషంకంటే మాట్లాడలేకపోయింది. హాలంతా కలకలం. మరెవర్నో ఏఏ సంవత్సరాల్లో ఏఏ క్లాసులు... ఏ ఏ స్కూల్, కాలేజీల్లో చదివావో-వరుసగా చెప్పమన్నాడు. అతను చెప్పలేకపోయాడు. ఇలా సాగింది, కొంత సేపు. ఉన్నట్టుండి, తననుద్దేశించి 'బాయ్ ఫ్రెండ్స్' గురించి చెప్పమన్నాడు. తను నిలబడింది. తడబడింది. క్షణం తర్వాత నిబ్బరించుకుని మాట్లాడింది. తన లోలోపలి కసినంతా వెళ్లగక్కేసింది. 'బాయ్స్‌లో ఫ్రెండ్స్ వుండరు. బ్రూట్స్ వుంటారు. సీనియర్ అనుకోగానే ప్రతివాడికీ కొమ్ములు మొలుస్తాయ్. కొందరు రోగిష్‌గా బిహేవ్ చేస్తారు. కొందరు దొంగ చూపుల్తో, వేషాల్తో నాటకాలాడ్తారు..' ఇలా సాగింది తన ధోరణి, ఆక్రోశం.

హాలంతా ఒకటే కోలాహలం. అరుపులు... గోల!

ప్రోగ్రాం అయిపోయింది. ఇంటికి బయల్దేరింది. బస్ దగ్గర చతుష్టయం!

"బాయ్స్ అంతా బ్రూట్స్‌కదా, మిట్టీ. రైట్ నువ్ చెప్పింది మా గురించేగా. సరే. నీకు అదే బిహేవియర్ కావాలంటే ఒ.కే.. మేమూ అదే ప్రూవ్ చేస్తాం" అని తన బుజానికున్న బ్యాగ్‌ని లాగాడు ప్రతాప్.

తాను అరుపులూ.. కేకలూ.. పెద్ద సీన్, చూస్తున్న వాళ్లంతా నవ్వుకుంటూ బస్‌లు ఎక్కేశారు. కరుణా, మాధవీ, సరళా-వాళ్ల వాళ్ల బస్సుల్లో ఎప్పుడో వెళ్లిపోయారు.

"సీయూ.. మిట్టీ.. వుయ్ విల్ కంటిన్యూ టూ బీ బ్యాడ్. టేక్ కేరాఫ్ యువర్ సెల్ఫ్. బ్యాగ్ కావాలంటే థౌజండ్ రూపీస్ ప్లీజ్" అంటూ బైక్ తీశాడు ప్రతాప్.

క్షణాల్లో నలుగురూ ఉడాయించారు. దడదడలాడే గుండెల్తో బస్‌లో పడింది తాను.

బస్ ఆగింది. మాణిక్యం ఆలోచనా ఆగింది. పక్కకి చూస్తే, అది తాను దిగాల్సిన స్టాపే!

దిగింది. ఇక్కణ్ణుంచీ కిలోమీటరు నడక.. భారంగా అడుగుకదిల్చింది.

విసుగ్గా వుంది. చిరాగ్గా వుంది. లేడిపిల్లని చేసి వేటాడుతున్న మృగాల్ని ఏంచేయాలి? ఇదీ ఉక్రోషం. ఇదీ కోపం. తన పాలిటి దుష్టచతుష్టయాన్ని శపిస్తూ నడుస్తోంది. క్రియ గానీ, కర్మగానీ లేని ఏకవాక్యాల్లో వాళ్లని ఉతికి ఆరేస్తోంది!

'చూద్దాం... చూద్దాం..' అనుకుంటుండగానే, సశేషంగా మిగిలింది స్వగతం.

ఇల్లు చేరింది మాణిక్యం.

❖ ❖ ❖

అలవైకుంఠ పురంబులో మాదిరి.. వంటిట్లో అమ్మ. టేబుల్‌మీద యాపిల్ ముక్కలు, దానిమ్మ గింజలు, ఒక అరటిపండు! అవి తినాలి!

ఫ్రెష్ అయివచ్చి ఫలాహారం పూర్తి చేసింది మాణిక్యం. బూస్ట్ కప్ వచ్చింది. తాగింది. హాయిగా వుంది.

"ట్రాఫిక్ జామ్ లేనా?" పరామర్శ. నవ్వుమొహం. నిరంతర ఉత్సాహం. 'అమ్మ నిజంగా గ్రేట్' అనిపించింది. ఆఁ, ఊఁ ల సమాధానాలిచ్చింది మాణిక్యం. యాంత్రికంగా టీవీ వీక్షణం. సీరియల్. నాలుగువందల అరవై ఆరో ఎపిసోడ్. ఎవడో-మరిది. వదినని కామిస్తున్నాడు. వేధిస్తున్నాడు. పన్నాగాలు పన్నుతున్నాడు. అసహ్యం, విరక్తి. ఛానెల్ మార్చింది. ఎవడో దుర్మార్గపు మృగాడు. కొత్త ఆయుధాన్ని మనిషి రక్తంలో ముంచి బొట్లూ, చుక్కలూ రాలుస్తూ.. తన వీరత్వాన్ని-ప్రేక్షక యువతకు పంచుతున్నాడు.

మాణిక్యం మనసు వికలమైంది. చతుష్టయం కళ్లముందు కొచ్చింది. ఏహ్యభావన. రోత!

కొద్దిసేపు సెల్ సంభాషణ, కరుణ, మాధవి, సరళ- ముగ్గురూ మాణిక్యంకి సలహాలు, తనని వదిలేసి వెళ్లిపోయినందుకు మాణిక్యం ఆ ముగ్గురికీ చివాట్లు-

కొద్దిసేపు టెర్రెస్ మీద పచార్లు చేసింది. ఆ తర్వాత రూమ్‌లో-యూట్యూబ్‌లో ఘంటసాల మాధుర్యగీతాలు.

కథల పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంది. బాగాలేదు.

ఎవరో అన్నట్టు 'సెల్లింగ్ చీప్ కన్ఫెషన్స్ ఎట్ హై కాస్ట్స్'! పక్కన పడేసింది. వచ్చి హాల్లో కూచుంది.

టీవీ తిరుగుతోంది. 24 గంటల వార్తలు. బ్రేకింగ్‌న్యూస్! లేడీ లెక్చరర్‌ని పొడిచేశాడు-విద్యార్థి! కారణం ఆమెని వీడు ప్రేమించాట్ట. పెళ్లి చేసుకోవాలి! ఆమె ఇద్దరు పిల్లల తల్లి! చిన్న కథనీ, పెద్ద గాథనీ ప్రసారం చేస్తోంది టీవీ!

'భగవాన్! 'ఆడవాళ్ల గతి ఇంతేనా?' కడుపులో తిప్పినట్లవుతోంది మాణిక్యంకి.

చెప్పటం.. సంభవాన్ని చూపటం.. ఆనాటికి సెన్సేషన్ సృష్టించటం! ఈ దుర్మార్గాన్ని ఎలా ఎవర్ట్ చేయటం? ఇదీ సమస్య. వందలమందివున్నా, ఆమెని ఎవ్వరూ రక్షించటానికి పూనుకోలేదేం? మాణిక్యం మనసు పరిపరివిధాల పోతోంది. టీవీలో ఆ స్త్రీ శోకస్వరాల్ని ప్రసారం చేస్తున్నారు. అసలీటీవీ వాళ్లు సంఘటనా స్థలంలో ఆ సమయంలో ఎలా వున్నారు? ఆ దృశ్యాన్ని ఎలా చిత్రీకరించగలిగారు? శతకోటి జవాబు లేని ప్రశ్నలు గుండెని బరువెక్కిస్తున్నాయి.

మాణిక్యం తండ్రి ఇల్లు చేరాడు. దృష్టి మరల్చింది మాణిక్యం. చిరునవ్వు. కుశల ప్రశ్నలు. చదువు పరామర్శ. కూతురికి బదులు తల్లి సమాధానాలు.

భోజనం అయిందనిపించి రూమ్‌కి చేరింది మాణిక్యం.

సిస్టంని ఆన్‌చేసింది. చేతివ్రేళ్లు మౌస్‌ని కదిలిస్తున్నై. ఏవేవో బాక్స్‌లు. వస్తున్నై. పోతున్నై.

సెల్ మోగింది. తీసింది. అవతలివైపు నుంచీ ప్రతాప్. విష్‌చేశాడు. మాణిక్యం గుండె దడదడలాడింది.-మొదటి సారి అతను ఫోన్ చేయటం, నెంబర్‌ని ఎలా సేకరించాడో? ఆలోచించలేకపోయింది. భయం కమ్ముకుంది.

"బి.రెడీ-మిట్టీ-ఫర్ ఎ బిగ్ ఫైట్. ముందు రేపు వెయ్యి తెచ్చి నీ బ్యాగ్‌ని విడిపించుకో. అయినా బ్యాగ్‌లో అస్సలు.. ఏ సీక్రెట్స్ లేవేం మిట్టీ? వోన్లీ బుక్స్! బ్యాడ్!"

స్విచాఫ్ చేసింది. 'ఛీ' అని ఛీదరించుకుంది.

తలపట్టుక్కూచుంది. ఏం చేయాలిప్పుడు? ఏమిటి తనకర్తవ్యం? ఆలోచనలతో బుర్రవేడెక్కుతోంది. కంప్యూటర్ స్క్రీన్ వైపు చూసింది. 'వర్జిన్ సూసైడ్స్' గురించి కనిపిస్తోంది. ఇదేంవిటీ? ఎలా వచ్చిందీ సైటు? ఆశ్చర్యం కంటే తత్తరపాటు ఎక్కువైంది. క్షణాల్లో అర్థమైంది. మనస్సులో భావనని మేథ స్వీకరించింది. చేతి

వేళ్లకి సందేశమిచ్చింది! అదే విషయం మీద ఇతర సైట్లు వచ్చినై. ఆడపిల్లల ఆత్మహత్యల గురించి చాలా రాశారు!

అవును. అదే అత్యుత్తమ పరిష్కారం, ఛస్తే పీడాపోతుంది. అన్నింటికీ అదే విరుగుడు. ఆ రాక్షసుల కొక గుణపాఠం కావాలి. నా జీవితాన్ని నాశనంచేస్తున్నది వాళ్లే అని సూసైడ్ నోట్‌లో రాసి కోలుకోలేని దెబ్బతీస్తాను. డర్టీ రోగ్స్! పళ్లు బిగబట్టింది మాణిక్యం. 'సిగ్గులేనివాళ్లు' 'బుద్ధిలేనివాళ్లు' పెద్దగానే అనేస్తున్నది.

ఒక జాగ్రద్ స్వప్నావస్థ. అన్నీ తెలుస్తూనే ఏమీ తెలియనట్లుందామెకు. భయం, అధైర్యం. ప్రేలాపన. ఎట్లా వాళ్ళ బారినుంచి తప్పించుకోవటం? ఒక్కటేమార్గం. అదే–ఆత్మహత్య. అంతే. శరీరంవణుకుతోంది. వెన్నులో జలదరింపు. వొళ్లంతా చెమటపట్టింది.

అంతలోనే,

బుజంమీద చల్లని స్పర్శ. మాణిక్యం రెప్పలు విచ్చుకున్నై. కళ్లు మందారాలైనై. చూసింది. అమ్మ! అమ్మ వేళ్లు నులివేడికన్నీటిని తుడిచాయి. అమ్మ పెదవులమీద వేదాంతిలా సన్నని నవ్వు. "పిచ్చి పిల్ల! భయపడకు. నాకంతా తెలుసు. కరుణ చెప్పింది. సమస్యకి ఆత్మహత్యే పరిష్కారమా? బతుకంటే ఏమనుకున్నావ్? పెద్ద ప్రయోగశాల. పాతసమస్యలకి కొత్త పరిష్కారాన్ని వెతుకుతూనే వుండాలి. పిచ్చిపిచ్చి ఆలోచనలు చెయ్యకు. పడుకో, విశ్రాంతి తీసుకో. నేనూ నీ దగ్గరే పడుకుంటా. ప్రశాంతంగా నిద్రపో",

మాణిక్యంకి దుఃఖమో సంతోషమో తెలీని ఉద్వేగం పొంగుకొచ్చింది. తల్లిని గట్టిగా కౌగిలించుకుంది. ఏడ్చేసింది..

–రాత్రి గడుస్తూనే వుంది!

❖ ❖ ❖

ఆ వారమల్లా మాణిక్యం కాలేజీకి వెళ్లలేదు. ఇంటి పట్టున వుండి ఆమె ఆందోళననీ, భయాన్నీ తేలికపరచుకోమని తల్లే సలహా ఇచ్చింది.

సోమవారం కాలేజ్‌కి వెళ్లింది మాణిక్యం. ఎక్కడా ఆ చతుష్టయం కనపడలేదు. కరుణా, మాధవీ, సరళా మాణిక్యంతో జోకులు వేస్తూ గడిపారు. ఆరోజంతా హాయిగా గడిచింది.

మంగళవారం నాడు కూడా ప్రతాప్ కూటమి కనపడలేదు.

బుధవారం క్యాంపస్‌లో కనపడ్డారు. కానీ ఎందుకనో మొహాలు పక్కకి తిప్పుకున్నారు. మాణిక్యంని చూసి ఆమె దగ్గరగా వచ్చి, ఆమె బ్యాగ్‌ని ఆమెకి ఇచ్చేసి వెళ్లిపోయాడు బాలు. మాటా పలుకూ లేదు. నలుగురూ నేలచూపులు చూస్తూ మొహంచాటు చేసుకుని వెళ్లిపోయారు.

రోజులు గడుస్తున్నై. ఏ ప్రత్యేకతా లేకుండా జారుకుంటున్నై. తన చదువుల్లో తాను బిజీ అయింది మాణిక్యం. క్రమంగా ప్రతాప్ చతుష్టయం మాణిక్యంని చూసి 'హాయ్!'లో కొచ్చారు. వాళ్ల పెదవులమీద చిరునవ్వు కదులుతోంది!

❖ ❖ ❖

మాణిక్యాన్ని వాళ్లమ్మ అడిగింది. "ఏవిటే కాలేజీ కబుర్లు? ఏంవీ చెప్పటం లేదు?' అని. అంతా ప్రశాంతంగా వుందని చెప్పింది మాణిక్యం. చతుష్టయం ప్రవర్తనలో మార్పు గురించీ చెప్పింది. అయితే ఆ మార్పు ఎలా వచ్చిందనే తాను ఆశ్చర్యపోతున్నాననీ తల్లికి చెప్పింది మాణిక్యం. తల్లి మాత్రం 'గుడ్' అని చిరునవ్వుతో తన పనిలోకి తాను వెళ్లింది.

ఎప్పుడో ర్యాగింగ్ భూతానికి బలైపోయిన యువతి. తర్వాత ఆ స్టూడెంట్స్‌కి పడిన శిక్ష ఎన్‌కౌంటర్. టీవీల్లో వచ్చిన కథనాలు, పేపర్లలో వివరాలు.. వీటన్నిటి గిఫ్ట్‌ప్యాక్‌లూ భద్రంగానే చతుష్టయానికి చేరాయని ఎవరు ఎవరికి చెప్పగలరు!

'నో అనుమానాలూ, సందేహాలూ ప్లీజ్. ఎలాంటి అన్వేషణలూ మొదలెట్టకండి. ఒట్టేసిచెబుతున్నాను. నాకు పోలీస్ అనే మాటంటేనే భయం. దాని స్పెల్లింగే రాదు!' అని తనకు తానే చెప్పుకుంటోంది మాణిక్యం తల్లి! పైకిమాత్రం 'జీవితం పెద్ద ప్రయోగశాల. మారుతున్న సందర్భాల్లో మనుషుల్ని మార్చటానికీ, మంచివైపు మళ్లించటానికీ అనేక ప్రత్యామ్నాయాల్ని ప్రయత్నిస్తూనే వుండాలి. ఏదో వొకటి ఫలించే అవకాశం వుంటుంది' అంటోంది.

ఇప్పుడు హాలంతా వెలుతురు రేకలే!

(జాగృతి 10.12.2012)